ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప

జిల్లా వార్తలు

5

ఆదివారం 17 మార్చి 2024



మోగిన ఎన్నికల నగారా



- అమల్లోకి వచ్చిన ఎన్నికల నియమావళి
- వలంటీర్లతో సహా అవుట్‌సోర్సింగ్, ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ సమావేశాల్లో పాల్గొంటే విధుల నుంచి తొలగింపు
- రూ.50వేలకు మించి డబ్బులు తీసుకుపోతే ఆధారాలు చూపించాలి
- మంగళవారం మధ్యాహ్నం లోపు ప్రభుత్వ కార్యాలయాల్లో..
- రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు తొలగించాల్సిందే
- జిల్లాలో 16,21,760 మంది ఓటర్లు
- కొత్త ఓటర్లు 39,735 మంది

జిల్లా జనాభా	: 22,47,356
పురుషులు	: 11,11,359
స్త్రీలు	: 11,35,997
ట్రాన్స్‌జెండర్స్	: 1,022
మొత్తం ఓటర్ల సంఖ్య	: 16,21,760
పురుషులు	: 7,92,371
స్త్రీలు	: 8,29,175
ట్రాన్స్‌జెండర్స్	: 214
ఈపీరేషియో	: 722
కొత్త ఓటర్ల సంఖ్య	: 39,735
వికలాంగ ఓటర్లు	: 18,437
80 ఏళ్లు పైబడ్డ వారు	: 7,574
మొత్తం పోలింగ్ స్టేషన్లు	: 1,963
క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు	: 527
సమస్యాత్మకమైనవి	: 10
మొత్తం పోలింగ్ ఆఫీసర్లు	: 2110
ప్రిసైడింగ్ అధికారులు(పీవో)	: 2510
అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో)	: 814



కడప, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అంటూ అందరూ ఆతృతగా ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. మే 13న పోలింగ్ జరగనుంది. ఇక ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ ఎన్నికలు నాలుగో విడతలో జరగనున్నాయి. ఈ మేరకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ శనివారం ఢిల్లీలో ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు వెల్లడించారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఎన్నికల షెడ్యూలుకు, పోలింగ్‌కు దాదాపు 63 రోజులు ఉంది. ఇంత సుదీర్ఘ సమయం బరిలో ఉన్న అభ్యర్థులకు భారం కానుంది. టీడీపీ, వైసీపీ ఇప్పటికే గ్రౌండ్ లెవల్‌లో ప్రచారాన్ని మొదలుపెట్టాయి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు జిల్లాలో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించారు. ఎన్డీయేతో పొత్తులో భాగంగా బద్వేలు, జమ్మలమడుగును బీజేపీకి కేటాయించారు. ఇక వైసీపీ అధినేత సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇడుపుల పాయలో జాబితాను శనివారం ప్రకటించారు. జిల్లాలో సిట్టింగ్‌లకు సీట్లు ఇచ్చేశారు.

జిల్లా ఓటర్లు 16,21,760

మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో జిల్లాలో 16,21,760 మంది ఓటు హక్కు వినియోగించనున్నారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల చేసి ఆ రోజు నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. జిల్లాలో కడప, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాలతో పాటు సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల పరిధిలో మొత్తం జనాభా 22,47,356 మంది ఉన్నారు. ఓటర్లు మాత్రం 16,21,760 మంది ఉన్నారు.

వలంటీర్లకు ఎన్నికల విధులు లేవు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వలంటీర్లకు ఎలాంటి విధులు లేవు. వలంటీర్లతో సహా ప్రభుత్వ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఇతర ఉద్యోగులు రాజకీయ పార్టీల తరపున పాల్గొంటే వేటు వేస్తామని కలెక్టరు విజయరామరాజు హెచ్చరించారు. రూ.50వేలకు మించి డబ్బులు తీసుకుపోతే ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం లోపు ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు తొలగించాల్సిందేనని ఎన్నికల కమిషన్ ఆదేశించింది.

ఎన్నికల పోరుకు సిద్ధం

సార్వత్రిక ఎన్నికలను టీడీపీతో పాటు వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడ్డాయి. ఇప్పటికే జిల్లాలో కడప, పులివెందుల, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు స్థానాల అభ్యర్థులను టీడీపీ ప్రకటించింది. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన బద్వేలు, జమ్మలమడుగు స్థానాలను ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కడప పార్లమెంటు స్థానానికి టీడీపీ అభ్యర్థి పెండింగులో ఉంది. ఇక వైసీపీ సిట్టింగ్‌లనే ఎన్నికలో బరిలో దించింది.

డూ ఆర్ డై

సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో నువ్వా నేనా అన్నట్లు సాగనున్నాయి. ఐదేళ్ల జగన్ ప్రభుత్వం అభివృద్ధిని కొన్ని ప్రాంతాలకే పరిమితం చేసింది. అయితే అవినీతి అక్రమాలు కబ్జాలను జిల్లా వ్యాప్తంగా విస్తరించింది. తమకు అన్యాయం జరిగిందని ఎవరైనా చెప్పుకున్నా.. జగన్ అండ్ కో పాలనలో న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. ఎవరైనా చెప్పినా కూడా వారిపై తీవ్ర స్థాయిలో వత్తిడి ఉండేది. చాలా మంది వైసీపీ నేతలు గవర్నమెంటు అంటే మాది, మా సొంత ఆస్తి అనేలా వ్యవహరించారు. అందుకే తప్పులు చేసినా సరే వాటిని కప్పి పుచ్చుకునేందుకు మీడియాపై చిందులేసేవారు. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో జనమంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రొద్దుటూరులో ఓ నేత అరాచకాలను జనం తట్టుకోలేకపోతున్నారు. కడపలో ఓ కార్పొరేటరు భర్త చిట్ ఫండ్ వ్యాపారాలకు తెరలేపి అధికారపార్టీ పేరు చెప్పుకుని నిబంధనలు ఉల్లంఘించినట్లు విమర్శ ఉంది. అనుమతి లేకున్నా లేఅవుట్లు వేసి కోట్లాది రూపాయల స్థలాలను అమాయకులకు కట్టబెట్టారంటారు. ఆయన అవినీతి అక్రమాలు చూసి తోటి కార్పొరేటర్లు అవాక్కవుతారు. కోడ్ రావడంతో కడపను శాసించే ఓ ముఠా ఆగడాలకు, ప్రొద్దుటూరు ఆగడాలకు తెర పడనుంది. ఇక పులివెందుల పెత్తనాన్ని కమలాపురం, కడప అడ్డుకుంటాయని అనుకుంటున్నారు.

నేషనల్ మెగా లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి



లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

- ఇక్కడి అవార్డులు సుప్రీంకోర్టు తీర్పుతో సమానం
- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్) మార్చి 16: నేషనల్ మెగా లోక్‌అదాలత్‌లో కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవడం వలన సత్వర న్యాయం పొందడంతోపాటు, డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవచ్చని డీఎల్ఎస్ఏ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో శనివారం నేషనల్ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా లోక్ అదాలత్‌లను దేశమంతటా నిర్వహిస్తూ వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఇక్కడ ఒకసారి కేసు పరిష్కారం అయితే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అపీల్‌కు వెళ్లడానికి వీలు పడదన్నారు. లోక్‌అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. దీర్ఘకాలిక కేసులకు కూడా లోక్‌అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా చక్కటి పరిష్కారం దొరుకుతుందన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం చేసుకోవడం వలన సమయం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు కోర్టు జిల్లా జడ్జి జి.గీత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్, ఎక్సైజ్ కోర్టు జడ్జి జే.హేమశ్రవంతి, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.నందిని, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.విజయలక్ష్మి, న్యాయవాదులు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్లు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

మూడు వేల కేసులకు అవార్డులు

- రూ.10,05,21,071 చెల్లింపులు

శనివారం కడపలోని జిల్లా కోర్టుతో పాటు ఉమ్మడి జిల్లాలోని సబ్ కోర్టుల్లో నేషనల్ మేగాలోక్ అదాలత్‌ను డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి తెలిపారు. లోక్‌అదాలత్‌కు వచ్చిన కేసుల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా 24 బెంచ్‌లు ఏర్పాటుచేశామన్నారు. ఇందులో భాగంగా జిల్లా కోర్టు ఆవరణంలో 6, ప్రొద్దుటూరు కోర్టులో 4, రాయచోటిలో 3, రాజంపేటలో 1, బద్వేల్‌లో 2, సిద్దవటం, నందలూరు రైల్వేకోడూరు, కమలాపురం, మైదుకూరు, లక్కిరెడ్డిపల్లె, జమ్మలమడుగు, పులివెందుల కోర్టుల్లో ఒక్కొక్క బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా బెంచ్‌లలో దాదాపు 3000కేసులను పరిష్కరించి అవార్డులు ఇచ్చామన్నారు. ఈ కేసుల మొత్తానికి దాదాపు రూ.10,05,21,071 చెల్లింపులు జరిగాయన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప (మారుతీనగర్), మార్చి 16 : ఆర్టీసీ బస్సుల ప్రయాణంలో తలెత్తే సమస్యల నివృత్తి కోసం సోమవారం సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం జరగనున్నట్లు పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులకు ఏవైనా సమస్యలుంటే తెలుసుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలు 9959225848 అనే నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

వైసీపీ మాఫియా రాజ్యాన్ని తరిమికొట్టాలి

- బాబు అనుభవం.. మోదీ సహకారంతో రాష్ట్రాభివృద్ధి
- అవినీతి, అభివృద్ధి నిరోధక ప్రభుత్వాన్ని దించేందుకే ఎన్డీయే కూటమి
- టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి.. చిత్రంలో బీజేపీ నేతలు శశిభూషణ్‌రెడ్డి, సింగారెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి16: రాష్ట్రాన్ని పీడిస్తున్న వైసీపీ మాఫియా రాజ్యాన్ని తరిమికొట్టాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పిలుపునిచ్చారు. చంద్రబాబు అనుభవం, నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తామన్నారు. అవినీతి, అభివృద్ధినిరోధక ప్రభుత్వాన్ని దించేందుకే ఎన్డీయే కూటమి ఏర్పడిందని స్పష్టం చేశారు. శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కడప నగరం ద్వారకానగర్‌లోని తన కార్యాలయంలో బీజేపీ, జనసేన నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో జనసేన ఎన్డీయేలో భాగస్వామ్యంగా ఉందన్నారు. కొత్తగా అనుభవజ్ఞులైన చంద్రబాబు కూడా ఎన్డీయేలో కలిశారని అన్నారు. చంద్రబాబు అనుభవం మోదీ సహకారంతో అరాచకపాలనకు అంతం పలకాలని తెలిపారు. జగన్ పరిపాలనలో కేంద్రం అన్నివిధాలుగా సహకారం అందిస్తున్నా అభివృద్ధిలో ముందుకు సాగని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు సంబంధించిన డ్రిప్ ఇరిగేషన్‌కు కేంద్రం సబ్సిడీ ఇచ్చినా దానిని వైసీపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకుండా పక్కన పెట్టిందన్నారు. కేంద్రం దాదాపు రూ.740 కోట్లు ఖర్చు పెట్టి మౌలిక వసతులు కల్పిస్తే కొప్పర్తిలో ఎటువంటి అభివృద్ధి లేకుండా చేశారన్నారు. వైసీపీ నాయకుల దౌర్జన్యం వల్లనే కొత్త పరిశ్రమలు ప్రారంభించేందుకు ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మాణం జరుగుతున్నాయని.. ఈ విషయాన్ని జగన్ ఎక్కడా చెప్పడం లేదన్నారు. చిలకలూరిపేటలో ప్రధాని మోదీ, పవన్‌కళ్యాణ్, చంద్రబాబు సభకు హాజరవుతున్నామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని ప్రజలకు వివరిస్తామన్నారు. బీజేపీ మైనార్టీలకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కడప నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి, బీజేపీ ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, బాలక్రిష్ణయాదవ్, జనసేన నేతలు మాలే శివ, బొమ్మన సుబ్బరాయుడు, తుంగా రమణయ్య, టీడీపీ నాయకులు హరిప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ బొజ్జ తిరుమలేశు తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్‌లకే సీట్లు

- సొంత అడ్డాలో సిట్టింగ్‌లను మారిస్తే..
- రాష్ట్రమంతటా ప్రభావం చూపుతుందనే భయంతో..
- ఆరోపణలున్నా మార్చని వైనం
- ఇడుపులపాయలో అభ్యర్థులను ప్రకటించిన జగన్



(కడప-ఆంధ్రజ్యోతి): అవును.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన సొంత జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మళ్లీ అభ్యర్థులుగా ప్రకటించేశారు. జగన్ సీఎం అయిన తరువాత ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో కొందరు ఎమ్మెల్యేలు, వైసీపీ నేతలు బరితెగించి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను కొల్లగొట్టారు. అదే స్థాయిలో సీఎం సొంత జిల్లాలోనూ కొందరు ఎమ్మెల్యేలు కోట్ల విలువచేసే పేదల ఆస్తులను పదో పరకో ఇచ్చి రాయించుకున్నారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించారు. సహజ వనరులైన ఇసుక, మట్టిని అడ్డంగా తవ్వేసి అమ్ముకున్నారు. అడ్డొచ్చిన జనంపైనే కాదు.. పోలీసులపైనా దాడులకు తెగబడ్డారు. అంతెందుకు సీఎం జగన్ పులివెందులే భూకబ్జాలకు అడ్డాగా మారింది. కలెక్టరు సంతకాలనే ఫోర్జరీ చేసి జగన్ కుటుంబీకులకు టోపీ వేశారు. కొంత మంది ఎమ్మెల్యేలు వైసీపీ నేతల భూములను సైతం కబ్జా చేశారు. ఇలాంటి వారి డేటా అంతా జగన్ వద్దనే ఉందని, చాలామందికి టికెట్ రాదంటూ వైసీపీ అండ్ కో బ్యాచ్‌తో పాటు ఇతరులంతా స్పష్టం చేస్తూ వచ్చారు. ఇలాంటి వారందరికీ సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వరు, వారందరినీ పక్కనపెడతారని చెప్పుకొచ్చారు. అయితే జగన్ శిబిరంలో ఈ పర్యాయం వన్‌సైడ్‌గా జిల్లాలో గెలుస్తామనే ధీమా లేదంటారు. అందుకే అభ్యర్థుల ప్రయోగానికి తెరలేపకుండా ఎన్ని ఆరోపణలున్నా సిట్టింగులకే ఇచ్చేశారంటారు.

హోరాహోరీ

జిల్లాలో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం సాగిస్తున్నారు. టీడీపీ నేతలు ఆరునెలలుగా జనంలో ఉంటూ వస్తున్నారు. ఇటీవల వైసీపీ నేతలు కూడా ప్రచారం మొదలుపెట్టారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ నుంచి పోలింగ్ వరకు చాలా సమయం ఉంది. ఇది రాజకీయ నాయకులకు భారం కానుంది. ఇక వైసీపీ నేతలు సీఎం సొంత జిల్లాలో పలుమార్లు ఐప్యాక్, జగన్ మీడియా ఇతరత్రా నిఘా వర్గాల ద్వారా సమాచారం సేకరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి, టీడీపీకి ఉన్న అనుకూలతలు ప్రతికూలతపై ఐప్యాక్ సర్వే చేయించినట్లు చెబుతారు. జగన్ ఇంటికి నేరుగా వెళ్లగలిగే ఓ ఎమ్మెల్యే వెళితే నీ పరిస్థితి బాగా లేదు, నీ టికెట్ మారుస్తామని జగన్ చెప్పగా.. ఆయన నేనేం మర్డరు చేయలేదు అని డైరెక్టుగా అటాక్ చేయడం చూసి జగన్ అండ్ కో శిబిరం భయపడిందంటారు. ఆ ఎమ్మెల్యే కూడా వైఎస్ ఫ్యామిలీకి చెందిన కీలక వ్యక్తి కావడం గమనార్హం. సొంత వ్యక్తి నుంచే బుల్లెట్‌లా మాటలు రావడంతో జగన్ స్టన్ అయినట్లు చెబుతారు. అందుకేనేమో.. సొంత జిల్లాలో ఎలాంటి ప్రయోగాలు చేయకుండా సిట్టింగ్‌లకు సీట్లు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది.

అభ్యర్థులు వీరే..

కడప ఎంపీగా సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికే మరోమారు టికెట్ కేటాయించారు. కడప పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకూ ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలే బరిలో తలపడతారు.

కడప	: అంజాద్‌బాషా షేక్ బేపారి
జమ్మలమడుగు	: డీఆర్ మూలె సుధీర్‌రెడ్డి
బద్వేల్ (ఎస్సీ)	: డీఆర్ దాసరి సుధ
పులివెందుల	: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి
కమలాపురం	: పోచిమిరెడ్డి రవీంద్రనాథరెడ్డి
మైదుకూరు	: రఘురామిరెడ్డి శెట్టిపల్లి
ప్రొద్దుటూరు	: రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి
కడప ఎంపీగా..	: వైఎస్ అవినాశ్‌రెడ్డి

జిల్లాలో సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శనివారం భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రటించిన నేపథ్యంలో.. కలెక్టరేట్ స్పందన మీడియా సెంటర్‌లో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, కడప మున్సిపల్ నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్‌తో కలసి కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారని, వచ్చే నెల 18వ తేదీన ఎన్నికల గజిట్ నోటిఫికేషన్ వెలువడుతుందని అన్నారు. 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ, 26వ తేదీన స్క్రూటినీ, 29 వతేదీన అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. మే నెల 13 వతేదీన పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటాయన్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తేదీ నుంచి జిల్లాలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- సమస్య వస్తే ఎంఈవో, డీవైఈవో, డీఈవోలకు తెలపాలి
- పది పరీక్షల జిల్లా పరిశీలకులు క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 16: జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల జిల్లా పరిశీలకులు ఎంవీ క్రిష్ణారెడ్డి సూచించారు. ప్రశ్నాపత్రం లీక్ అయితే సంబంధిత కేంద్రాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే ఎంఈవో, డీవైఈవో, డీఈవోలకు తెలియజేయాలని సూచించారు. శనివారం కడప నగరం డీఈవో కార్యాలయంలో చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 153 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 581 పాఠశాలల నుంచి 27,859 మంది విద్యార్థులు హాజరవుతున్నారని వారిలో అబ్బాయిలు 14,269 మంది, అమ్మాయిలు 13,589 మంది పరీక్షలు రాస్తున్నారని అన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి 153 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను అలాగే 1320 మంది ఇన్విజిలేటర్లు, 153 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, టాస్క్‌ఫోర్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించామన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు సిట్టింగ్ స్క్వాడ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ప్రశ్నాపత్రానికి క్యూఆర్ కోడ్ ఇచ్చామని, పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయితే అది ఏ కేంద్రం నుంచి లీక్ అయినదీ తెలుస్తుందని ఆ కేంద్రంపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అలాగే పరీక్షల నిర్వాహకులందరికీ ఐడీ కార్డులు ఇచ్చామన్నారు. ఉదయం 9.30 నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో అనురాధతో పాటు, ఆర్‌జేడీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా పరిశీలకులు ఎంవీ క్రిష్ణారెడ్డి

ఎన్నికలకు సర్వం సిద్ధం

- జిల్లాలో ఓటర్లు 16,22,416 మంది
- పోలింగ్ స్టేషన్లు 1,963
- సిద్దవటం, ఒంటిమిట్టలో మరో 72 పోలింగ్ కేంద్రాలు
- క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 527
- 85 ఏళ్ల నిండిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08562-315672 ఏర్పాటు
- వలంటీర్లు, ఉద్యోగులు ఎన్నికల్లో పాల్గొంటే కఠిన చర్యలు
- అమల్లోకి ఎన్నికల నియమావళి
- జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 16: జిల్లాలో 16,22416 మంది ఓటర్లు ఉన్నారని వీరికోసం జిల్లా వ్యాప్తంగా 2035 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కడప పార్లమెంట్ పరిధిలో 7నియోజక వర్గాలో 1941 పోలింగ్ కేంద్రాలుండగా, 15 వందల ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలు కూడా కడప జిల్లా పరిధిలో ఉన్నందున ఈ రెండు మండలాల్లో 72 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించామన్నారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు ఇంటి నుంచే ఓటు వేసే వెసలుబాటు కల్పించామన్నారు.

పలు దఫాలుగా శిక్షణ పూర్తి

ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 6 నెలలుగా కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్స్, స్టాటికల్ సర్వేలైన్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో నిఘా బృందాలతో పాటు... రాజకీయ పార్టీలకు, బీఎల్వోల నుంచి ఈ ఆర్వోలు, సహాయ అధికారులకు దాదాపు 33 సార్లు శిక్షణ ఇచ్చామన్నారు. 16 మందిని ప్రత్యేక నోడల్ అధికారులను కూడా నియమించామన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఓటర్లకు సంబంధించిన అన్ని అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా ప్రతిస్తామన్నారు.

72 గంటల్లో

పూర్తి స్థాయిలో ఎంసీసీ అమలు

ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన 72 గంటల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు (ఎన్నికల నియమావళికి) సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలను మూసివేయడంతో పాటు ఫ్లెక్సీలు, పబ్లిక్ ప్రాంతాలతో పాటు ప్రైవేట్ ప్రాంతాల్లో లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆల్ రైటింగ్, బోర్డింగ్‌లు, జెండాలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని అలా తీసుకెళితే బ్యాంకు రసీదు తప్పనిసరిగా ఉండాలన్నారు.

సభలు సమావేశాలకు అనుమతి తప్పనిసరి

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తేదీ నుంచి రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు,వాహనాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు ఉల్లంఘించరాదన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు నామినేషన్ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కొత్త ఓటరు గుర్తింపు కార్డుల సంఖ్య 2,28,883 కాగా అందులో 1.91 లక్షల కార్డులు పంపిణీ చేశామన్నారు. మిగిలిన కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ చేస్తామన్నారు.

వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనరాదు

ఎన్నికల సంఘం స్పష్టంగా మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల విధుల్లో కానీ, ఓటర్లను ప్రభావితం చేసే అంశాలలో కానీ వలంటీర్లు పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాజకీయ ప్రచారాల్లో ఉండకూడదన్నారు. అలా ఎవరైనా ఉంటే వారి ఫొటో తీసి కలెక్టరేట్‌కు పంపితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు సంబంధించి జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల అవకతవకలపై టోల్‌ఫ్రీ నెంబరు 08562-315672కు లేదా ఎలక్షన్ కంప్లైంట్స్ వైఎస్సార్ 2024 ఈ మెయిల్‌కు పంపవచ్చన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం : ఎస్పీ

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు బందోబస్తుకోసం 5828 మంది సిద్ధంగా ఉన్నారని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ స్పష్టం చేశారు. మరో 10 పారామిలటరీ బలగాలు కావాలని కేంద్రాన్ని కోరామన్నారు. ఈ ఏడాది జనవరి 2024 నుంచి ఇప్పటివరకు రూ.20.95 కోట్ల విలువైన వస్తువులు, మద్యం, డ్రగ్స్ సీజ్ చేశామన్నారు. ఎన్నికల్లో ప్రభావం చూపుతారని ముందుగానే 14,852 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా పోలీసుబలగాలతో పల్లెనిద్ర కూడా చేస్తామని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా కట్టుదిట్టమైన బందోబస్తు ఉంటుందని ఎస్పీ తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప తాలూకా సీఐగా తిమ్మయ్య



మాట్లాడుతున్న కడప తాలూకా పోలీస్ స్టేషన్ సీఐ తిమ్మయ్య

కడప(క్రైం), మార్చి 16 : కడప తాలూకా పోలీస్ స్టేషన్ సీఐగా ఎం.తిమ్మయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా సిరివెళ్లకు చెందిన తిమ్మయ్య 2004లో ఆర్ఎస్ఐ పోలీస్ శాఖలో ఎంపికయ్యారు. 2009లో సివిల్ విభాగంలోకి మారి ఎస్ఐగా చిత్తూరు, అనంతపురం జిల్లాలో పనిచేశారు. 2023లో సీఐగా పదోన్నతి పొందారు. అనంతపురం, ఉరవ కొండలో పని చేస్తూ వీఆర్‌కు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి కడప బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

'శిక్షణా తరగతుల జీఓను సవరించాలి'

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 16 : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని విడుదల చేసిన జీఓను సవరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈశ్వర్‌చంద్ర, అలీఖాన్ ఒక సంయుక్త ప్రకటనలో శనివారం డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తే ఫండమెంటల్ రూల్స్ ప్రకారం ఈఎల్ మంజూరు చేయాల్సి ఉండగా వాటిని తుంగలో తొక్కుతూ ఉత్తర్వులు ఇవ్వడం శోచనీయమన్నారు. వీరందరికీ సంపాదిత సెలవులు మంజూరు అయ్యేవిధంగా ఉత్తర్వులు సవరించాలని కోరారు. పదోతరగతి పరీక్షల నిర్వహణ కోసం వెళ్లే ఉపాధ్యాయులపై యాక్ట్ 25 ప్రకారం శిక్ష ఉంటుందని ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు.

ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా శరత్‌బాబు

కమలాపురం రూరల్, మార్చి 16 : రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా కమలాపురంకు చెందిన కొర్రపాటి శరత్‌బాబును నియమించారు. ఈ సందర్భంగా స్టేట్ ఎస్సీ జనరల్ సెక్రటరీ పదవి చేపట్టిన అనంతరం విలేకరుల సమావేశంలో కొర్రపాటి శరత్‌బాబు మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం పాటుపడతానన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయం

చెన్నూరు, మార్చి 16 : ప్రజలకు నిత్యం మంచి ఆరోగ్యం ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అన్నారు. చెన్నూరులో రూ.4.70 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇల్లు

మండలంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ సొంతిల్లు ఉండాలన్నదే తమ ధ్యేయమని ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అన్నారు. శనివారం చెన్నూరులో మండల వ్యాప్తంగా అర్హులైన 881 మందికి స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటిపట్టాలు అందించారు.

'హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులూ... ఈకేవైసీ సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ చేసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), మార్చి 16 : హిందుస్తాన్ పెట్రోలియం గ్యాస్ వినియోగదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ సేఫ్టీ ఇన్స్‌పెక్షన్ చేసుకోవాలని హెచ్‌పీ గ్యాస్ అధినేత గరిశా వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈకేవైసీ ఉచితంగా చేస్తున్నామని, వినియోగదారులందరూ ఈ నెలాఖరులోగా చేయించుకోవాలన్నారు. చేయించుకోని వారికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే రాయితీలు రాకపోవచ్చని తెలిపారు. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ వద్ద కానీ, ఇళ్ల వద్దకు వచ్చే తమ సిబ్బంది వద్ద కానీ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. తమ సిబ్బంది గ్యాస్ కనెక్షన్‌ను పరిశీలించి దానికి సంబంధించిన వివరాలు యాప్‌లో నమోదు చేస్తారన్నారు.ఈకేవైసీ చేయించుకోవడం వల్ల ఎటువంటి నష్టం ఉండదని, బెనిఫిట్స్ ఉంటాయని ఆయన వివరించారు.

లక్ష్మీ నరసింహునికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, మార్చి 16 : శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం చేశారు. దాతలు ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కామిశెట్టి సుకుమార్, ఆయన సతీమణి సింధు సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీలో బీటెక్ రవి



టీడీపీకి ఓటేయాలని మహిళను అభ్యర్థిస్తున్న బీటెక్ రవి

చక్రాయపేట, మార్చి 16: అనుభవం, విజన్ కలిగిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొట్లమిట్ట, మహదేవపల్లె గ్రామాలలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధిచేకూరుతుందో వివరిస్తూ కరపత్రాలు అందించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే తనకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని అభ్యర్థించారు. మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే సురభి గ్రామం నాగులగుట్టపల్లెలోని దాసరి ఆంజనేయులు పెట్రోల్ బంక్‌ను బీటెక్ రవి ప్రారంభించారు.

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలి

● కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 16 : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం 37వ డివిజన్ సాయిపేటలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటేసి గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు జిలానీ, సుబ్బరాయుడు, స్థానిక నా యకులు పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



పదోతరగతి పరీక్షలకు సిద్ధమైన చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాల

వల్లూరు, మార్చి 16 : పదో తరగతి పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈఓ లిల్లెమ్మ తెలిపారు. వల్లూరు మండలంలో రెండు సెంటర్లను కేటాయించారన్నారు. ఒకటి గంగాయపల్లెలోని ఆదర్శ పాఠశాల, రెండోది వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్నారు. ఆదర్శ పాఠశాలలో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వల్లూరులో 117 మంది విద్యార్థులను కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 657 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నట్లు వివరించారు. పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు నిర్వహణ ఉంటుందని, విద్యార్థులు గంట ముందుగానే సెంటరు వద్దకు రావాలని, ఒక నిమిషం ఆలస్యమైనా పంపించేది లేదని పేర్కొన్నారు. అలాగే 18 నుంచి ఇంటర్ ఓపెన్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వల్లూరు, మాడల్ స్కూలు సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. వల్లూరులో హైస్కూలులో 245 మంది, మాడల్ స్కూలు నందు 310 మంది విద్యార్థులు రాస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

చెన్నూరులో... మండల కేంద్రమైన చెన్నూరులోని బాలికల ఉన్నత పాఠశాల, స్థానిక ఆర్ఆర్ పాఠశాలలో పదోతరగతి పరీక్షల కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో 196 మంది, ఆర్ఆర్ పాఠశాలలో 168 మం ది విద్యార్థులు పరీక్ష రాయబోతున్నారు. పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు అనుక్షణం పర్యవేక్షిస్తుంటారని, ప్రతి ఒక్కరూ సక్రమంగా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణులు కావాలని ఆయన తెలిపారు.

విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలి: పీడీఎస్‌యూ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 16 : రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షల్లో ప్రతిభ గల విద్యార్థులకు అన్యా యం జరగకుండా చూడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయంలో పది పరీక్షల జిల్లా పరిశీలకులు ఎంవీ క్రిష్ణారెడ్డి, డీఈఓ అనురాధలకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని గత సంవత్సరం బి.మఠంలో జరిగిన పేపరు లీకేజీ వంటివి మళ్లీ ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు గణేశ్, విఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకోసమే ఉచిత కల్యాణ మండపం నిర్మాణం



రోడ్డు క్రిష్ణాపురంలో కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కందుల కుటుంబ సభ్యులు

సీకేదిన్నె, మార్చి 16: గ్రామీణ పేద ప్రజల సౌకర్యార్థం ఉచిత కల్యాణ మండపం నిర్మాణాన్ని చే పడుతున్నట్లు కేఎస్ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని) తెలిపారు. స్థానికం గా కల్యాణ మండపా లు లేక పేద ప్రజలు అనేక ఇబ్బందులకు గురై వ్యయప్రయాసలకు ఓర్చి దూర ప్రాంతాలకు పోవాల్సి వస్తుందన్నారు. వారి ఇబ్బందులు తొలగించేందుకే స్థానిక తాడిగొట్ల పంచాయతీ రోడ్డు క్రిష్ణాపురం గ్రామం నందు ఉచిత కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. స్థానిక ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రానున్న అయిదు నెలల్లో కల్యాణ మండపాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కళాశాల కోశాధికారి కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి కోరిక ప్రకారం ఆయన కోరిక మేరకు కల్యాణ మండపం నిర్మించి పేదలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని ఆయన కళ వారి కుమారులు నెరవేర్చుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇకపై పేదల దూరాభారం పోవాల్సి ఉండదని, స్థానికంగానే వివాహాలు, పంక్షన్లు జరుపుకునేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి

● జేసీ గణేశ్‌కుమార్



మాట్లాడుతున్న గణేశ్‌కుమార్

కమలాపురం రూరల్, మార్చి 16 : ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని జేసీ గణేశ్‌కుమార్ తెలిపారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా ఎన్నికల తేదీలను ప్రకటించిందన్నారు. ఈ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులో ఉం టుందన్నారు. నియోజకవర్గంలో 130 పోలింగ్ కేంద్రాలున్నాయని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 58గా నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే రాజకీయ నాయకుల బ్యానర్లు, నాయకుల విగ్రహాలు ఉండే కప్పివేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రాలు పటాలు బ్యానర్లు ఉంటే 24 గంటల్లో తలొగించాలన్నారు. ఇళ్లపై పార్టీల జెండాలు ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుబ్రమణ్యం,ఎన్నికల డీటీ నరేంద్ర పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అందరికీ ఆదర్శం: డీఆర్వో



అమరజీవి చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్), మార్చి 16: ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమ రజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అందరికీ ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో అమర జీవి పొట్టిశ్రీరాములు జయంతి సంస్మరణ సభ జరిగింది. మైనార్టీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, బీసీ జిల్లా సంక్షేమాధికారి ఈరన్న, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు పొట్టిశ్రీరాములు: వైవీయూ వీసీ

కడప (ఎడ్యుకేషన్), మార్చి 16 : తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రసాధన కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి అమరజీవి పొట్టిశ్రీరాములు అని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ అన్నారు. శనివారం వైవీయు పరిపాలన భవనం ప్రాంగణంలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు జీవితంలోని ప్రధాన అంశాలను ప్రస్తావించారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిదని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ అంజనేయప్రసాద్ తెలిపారు. శనివారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటరు మనోహర్‌రావు, ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

కడప (మారుతీనగర్), మార్చి 16 : తెలుగుభాష మాట్లాడే ప్రజలందరికీ ప్రత్యేక తెలుగు రాష్ట్రం కావాలని, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా త్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు కొనియాడారు. పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక హబీబుల్లా వీధిలోని ఎన్టీఆర్, ఎన్బీకే అభిమాన సంఘం కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

తెలుగుజాతి ఉన్నంత కాలం పొట్టిశ్రీరాములు బతికే ఉంటారు

పులివెందుల రూరల్, మార్చి 16: తెలుగుజాతి ఉన్నంత కాలం పొట్టిశ్రీరాములు బతికే ఉంటారని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్ఎస్ బేగ్ అన్నారు. శనివారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని స్థానిక కళాశాలలో ఘనంగా నిర్వహించారు. స్టూడెంట్ యాక్టివిటీ అధికారి డాక్టర్ రాజేష్, అధ్యాపకులు డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

వేములలో... వేములలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపం





పక్కకు వాలిపోయిన స్తంభం... స్తంభానికి కడ్డీలు బయటపడిన దృశ్యం

చక్రాయపేట, మార్చి 16: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతోంది. కరెంటు స్తంభాలు సుమారు ఆరు నెలల క్రితం దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఏ టైంలో ఏమి జరుగుతుందో భయంగా ఉందని అధికారులకు తెలియజేసినా వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు రైతులు అంటున్నారు. మండలంలోని యర్రబొమ్మనపల్లె గ్రామ పొలంలో సర్వే నెంబర్ 12లో కోనేటి విజయ్‌కుమార్, కోనేటి నాగేశ్వరరావుకు చెందిన భూమిలో విద్యుత్ పెద్దలైన్ పోతుంది. ఈ లైన్ స్తంభాలు ఆరు నెలల క్రితం పూర్తిగా ఒక పక్కకి వాలిపోయి ఉంది. పోలు కూడా కేవలం కడ్డీలపై ఉంది. అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ కొత్త స్తంభాలు వేయాలని రైతులు కోరుతున్నారు.

'సీఏఏ చట్టాన్ని రద్దు చేయాలి'



ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సంఘాల నాయకులు, సీపీఎం, సీపీఐ నేతలు

కడప (మారుతీనగర్), మార్చి 16 :దేశంలోని ముస్లింలను టార్గెట్ చేసుకుని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని సంఘ సేవకుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సలావుద్దీన్ మోదీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను అణగదొక్కాలనే సీఏఏను తెరపైకి తీసుకురావడం దారుణమన్నారు. సీఏఏ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా భారత రాజ్యాంగ పరిరక్షణ కమిటి ఆధ్వర్యంలో శనివారం స్థానిక అల్మాస్‌పేట సర్కిల్ నుంచి చిలకలబావి, రెండో గాంధీ బొమ్మ, వన్‌టౌన్ సర్కిల్, గోకుల్‌సర్కిల్, సెవెన్‌రోడ్స్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశం భిన్నజాతులకు, భిన్న మతాలకు నిలయం అనే సంగతి బీజేపీ ప్రభుత్వానికి తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ముస్లిం సంఘాల నాయకులు మగ్బుల్‌బాషా, దస్తగిరి, కరీముల్లా, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 16 : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎన్ఎస్ఎస్ పీఓ షకీలాబేగం తెలిపారు. శనివారం కడప నగరం కోఆపరేటివ్ కాలనీలో ప్రభుత్వ బాలికల కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించారు. అలాగే శుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ గోవిందరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

పెండింగులో ఉన్న అంగన్వాడీల వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న మనోహర్

కడప (నాగరాజుపేట), మార్చి 16 :జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు పెండింగులో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎన్జీఓ కాలనీలోని కార్యాలయంలో ఆ యన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భవనాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు మెయింటెనెన్స్ కింద రూ.3వేలు అకౌంటులో వేశారని, అయితే పీడీ తిరిగి సూపర్‌వైజర్లు, సీడీపీఓల ద్వారా కట్టమని హుకుం జారీ చేయడం, అంగన్వాడీ వర్కర్లను బెదిరించడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా కట్టనివారికి మెమోలు ఇచ్చి బెదిరింపు చర్యలకు పాల్పడుతుండటం దారుణమన్నారు. ఐసీడీఎస్ జిల్లా అధికారులు కక్షపూరిత చర్యలు మానుకుని పెండింగులో ఉన్న జీతాలను త్వరగా వచ్చేలా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి దాసరివిజయ్, నాయకులు ఏవీ వినయ్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న చైర్మన్, ఇన్‌చార్జి ఈఓలు

వేంపల్లె, మార్చి 16: వేంపల్లె పాపాఘ్ని నదీతీరాన ఎద్దుల కొండపై వెలసిన శ్రీవృషభాచలేశ్వర స్వామి అనుసంధానమైన ఆలయాల హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శనివారం వేంకటేశ్వరస్వామి, వీరాంజనేయస్వామి, వృషభాచలేశ్వర స్వామి ఆలయాల హుండీల లెక్కింపు నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ ఆర్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ హుండీల లెక్కింపు ద్వారా రూ.2.65 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు ఈ ఆదాయం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కురాకుల వెంకటేష్, పాలక మండలి సభ్యులు అరవింద్, బాలాజీ, శ్రీనివాసులు, సిద్దారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రంగప్రసాద్, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

రక్తహీనత బారిన పడొద్దు



తొండూరు పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రేష్మ

పులివెందుల టౌన్, మార్చి 16: బాలింతలు, గర్భవతులు రక్తహీనత బారిన పడొద్దని తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేష్మ అన్నారు. శనివారం తొండూరు పీహెచ్‌సీలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతుల కు, బాలింతలకు, కిశోర బాలికలకు రక్తపరీక్షలు, వైద్యపరీక్షలు నిర్వహించారు. పోషకాహారం, ఆరోగ్య ఆహార పద్ధతులను వివరించారు. గర్భస్థ పూర్వ, పిం డ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం గు రించి తెలియజేశారు. రక్తహీనత ఉన్నవాళ్లు ఐరన్ సుక్రోస్ ఇంజక్షన్లు లేదా అవసరమైతే రక్తం ఎక్కించుకోవాలని కోరారు. మందులు, మాత్రలు పంపిణీ చేశారు. డిప్యూటీ డెమో రమణమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



అమ్మగారిపల్లె అంగన్వాడీ సెంటర్‌లో పోషణ పక్వాడ కార్యక్రమ దృశ్యం

వేంపల్లె, మార్చి 16: గర్భిణులు, బాలింతలు, పిల్లలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, తద్వారా రక్తహీనతబారిన పడకుండా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరత్న తెలిపారు. శనివారం వేంపల్లె-2 సెక్టార్‌లోని అమ్మగారిపల్లె అంగన్వాడీ సెంటర్ పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకవిలువల ఆహారాన్ని, ముర్రుపాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ యశోద, అంగన్వాడీ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

● ఉపాధి పనుల కల్పనపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 16: వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించారు. శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, డీఆర్‌వో సత్యనారాయణరావు హాజరయ్యారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్ఠంగా అమలు పర్చాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో ఇప్పటికే ఆమోదం పొంది ప్రారంభించి ఇంకా పూర్తి కాని పనులను పూర్తి చేయాలన్నారు. కొత్త పనులను చేపట్టరాదన్నారు. వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి రాకుండా తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు వెళ్లాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో ఉపాధి పనులను విరివిగా చేపట్టాలని జల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులకు సూచించారు. ముఖ్యంగా కరువు మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే ఆమోదం పొందిన సెల్ఫ్ ఆఫ్ గ్రూప్ పనులను ముమ్మరం చేయాలన్నారు. హౌసింగ్‌లో 90 రోజుల పనులు పూర్తయిన వాటికి బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల మోడల్ కోడ్ దృష్టిలో ఉంచుకొని ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా జిల్లాలో ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించాలని, వైద్య శిబిరాల్లో గుర్తించిన రెఫరల్ రోగులను ఆసుపత్రులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. నీటి కలుషితం వలన డయేరియా ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జనన, మరణాలను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో వీసీ ఆకస్మిక తనిఖీ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 16 : యోగివేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాక్ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది హాజరు రిజిస్టర్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. సెలవులో ఉన్న వారి అనుమతి పత్రాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్న వారిని పరీక్షకు అనుమతించవద్దని సూచించారు. అకడమిక్ విషయాలపై చర్చించి సూచనలు చేశారు. స్కాలర్ల పరిశోధనలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

రామాపురం మండల వాసికి

గేట్‌లో ఆల్‌ఇండియా 65వ ర్యాంకు




గురు మహేశ్

రామాపురం, మార్చి 16: ఇటీవల జరిగిన గేట్ పరీక్షలో మండలంలోని కుమ్మరిపల్లె పంచాయతీ మన్నేరువాండ్ల పల్లికి చెందిన పసుపులేటి అనురాధ, శివశంకర్ దంపతుల కుమారుడు గురుమహేశ్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో 65వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయదారులు కాగా, ఈ విద్యార్థి హైస్కూలు స్థాయి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో, ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదివాడు. ఆల్ ఇండియా 65 ర్యాంకు రావడంతో గ్రామంలోని ప్రజలు, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఒత్తిడి జయిస్తే.. ఉత్తమ ఫలితాలు

● విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచన ● రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు



కడప (ఎడ్యుకేషన్), మార్చి 16: పదోతరగతి పరీక్షలు దగ్గరపడ్డాయి. మరో రెండురోజులు మాత్రమే ఉండడంతో విద్యార్థులకే కాదు.. వారి తల్లిదండ్రులకు పరీక్ష కాలం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 581 పాఠశాలల్లో 27,858 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పదో తరగతి పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 153 కేంద్రాలు సిద్ధం చేశారు. పరీక్షలు దగ్గరపడే కొద్దీ విద్యార్థులు వత్తిడికి గురై మానసికంగా కృంగిపోకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని ఉపాధ్యాయులు, వైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా నిద్రలేమి, మానసిక వత్తిడి, భయం, మతిమరుపు నుంచి విద్యార్థులు బయట పడేందుకు పలువురు నిపుణులు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

ధీమాతో ముందడుగు

నేర్చుకున్న పాఠ్యాంశాల్లోని ప్రశ్నలకు సమాధానాలు రాయగలనన్న విశ్వాసం ఉండాలి. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తామన్న ధీమా విజయాన్ని అందిస్తుంది. మానసిక వత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉంటూ నేర్చుకున్న పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేస్తుండాలి. పరీక్షలకు ఏ ప్రశ్నలు వస్తాయో, ఏం చదవాలో, ముఖ్యమైన ప్రశ్నలు ఏవో అన్న గందరగోళానికి గురి కాకూడదు. ఇలా ఆలోచిస్తే నేర్చుకున్న విషయాలు మరిచిపోయే ప్రమాదం ఉంటుంది. తల్లిదండ్రులు ఇతరులతో పోల్చి తక్కువ చేసి మాట్లాడడం, ఎప్పుడూ చదవమని చెప్పడం వల్ల మానసిక సంఘర్షణకు గురయ్యే అవకాశం ఉంటుంది. పరీక్షల సమయంలో అతిగా తినడం, ఎప్పుడు పడితే అప్పుడు నిద్రపోవడం చేయకూడదు.

భౌతికశాస్త్రంలో కొత్త విషయాల జోలికి వెళ్లకూడదు..



విద్యార్థులు ఉన్న సమయంలో కొత్త విసయాల జోలికి వెళ్లకూడదు. ఎస్ఏ1, ఎస్ఏ2 యాక్షన్‌ప్లాన్ పేపర్స్ ఫాలో అయితే సులభంగా ఫిజికల్ సైన్స్ పేపరులో కనీసం 30 మార్కులకు పైన తెచ్చుకోవచ్చు. రసాయన శాస్త్రంలోని పరమాణు నిర్మాణం, లోహ సంగ్రహణం శాస్త్రం, ఆమ్లం, క్షారాలు (యాసిడ్) పాఠ్యాంశాల నుంచి చిత్రపటాలు, రివిజన్ చేసుకుంటే తప్పక ఉత్తీర్ణత లభిస్తుంది. భౌతిక శాస్త్రంలోని కటకటాలు, దృష్టిదోషాలు, సంబంధించిన ప్రయోగాలు రివిజన్ చేసుకోవాలి. ఉష్ణం పాఠ్యాంశం నుంచి రివిజన్ చేసుకోవాలి. ఈ రెండురోజుల్లో కొత్త ప్రశ్నలు, మోడల్ పేపర్లు తదతర వాటిపై దృష్టి పెట్టకపోవడమే మంచిది. గతంలో విద్యార్థులు చదవిన, రాసిన జవాబులు రివిజన్ చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు.

- రమణయ్య, స్కూలు అసిస్టెంటు

తెలుగు ఉత్తీర్ణత కావడానికి..



1, 3, 7, 8, 10 పాఠాల్లో కవి పరిచయంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలి. 2, 4, 6, 9, 11 పాఠ్యాంశాల్లో పూర్తిస్థాయిలో అవగాహన కలిగిన ప్రక్రియ నేపధ్యంలో పై ప్రశ్నలకు జవాబు రాయడం సులభమవుతుంది. వ్యాకరణంలో అలంకారం, ఛందస్సు, అర్థాలు, పర్యాయ పదాలు, నానార్థాలు, ఉత్పత్తి అర్థాలపై పూర్తి అవగాన పెంచుకోవాలి, 1, 2, 4 ప్రశ్నలకు వచ్చే పేరాలను బాగా చదివి జవాబు రాయాలి.

- చెంగల్‌రెడ్డి, స్కూలు అసిస్టెంటు, తెలుగు

ఎండ ప్రభావానికి లోను కాకూడదు..

విద్యార్థులు ఎండ ప్రభావానికి లోనుకాకుండా ఎప్పటికప్పుడు చల్లని పానీయాలను సేవిస్తుండాలి. తగిన మోతాదులో గ్లూకోజ్ కలిపిన నీళ్లను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లాలి. ఎటువంటి వత్తిడికి లోను కాకుండా ప్రశాపత్రాలు బాగా చదివి కేటాయించిన సమయంలోపు జవాబు రాయగలగాలి మెదడుకు కనీసం ఆరు గంటలు విశ్రాంతి ఇచ్చే విధంగా అభ్యసనాన్ని కొనసాగించాలి. తెల్లవారుజామునే నిద్రలేచి కష్టమైన విషయాలను అభ్యసించాలి. పరీక్ష అనంతరం కొబ్బరి నీళ్లు అందుబాటులో ఉంటే లేదంటే చల్లని పానీయాలు స్వీకరించాలి. పరీక్ష ఫలితాలపై ఎటువంటి భయాందోళనకు గురికావద్దు.

- డాక్టర్ ఎన్.నాగార్జున, పిల్లల వైద్యుడు, ప్రొద్దుటూరు



గణిత ఉత్తీర్ణతకు సులభ సూత్రాలు..



గణితంలో సులభంగా ఉత్తీర్ణత కావడానికి ఈ సూచనలు పాటించాలి. 8 మార్కుల ప్రశ్నలు వాస్తవ సంఖ్యలు, బహుపదులు, వర్గ సమీకరణలు, నిరూపక యామితి, సంభావ్యత పాఠాలలో అభ్యసనం చేయాలి. 2, 4 మార్కుల ప్రశ్నలు వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, శ్రేణులు నిరూపక సమితి, సంఖ్య శాస్త్రం పాఠాలు అభ్యసించాలి, ఒకమారు ప్రశ్నలు 2, 4, 8 మార్కులకు సూచించిన పాఠాల నుంచి అభ్యసనం చేయాలి. వచ్చిన వాటికి జ వాబులు రాయాలి. స్వరూప త్రిభుజాలు, పాఠాలకు చెందిన నిర్మాణాలు గీయడంలో తర్ఫీదు పొందాలి, బహుపదుల్లో గ్రాఫ్‌లు తీయడంపై పట్టు పెంచుకోవాలి. 2023 పబ్లిక్ ప్రీఫైనల్, 2024ప్రీ ఫైనల్, ఎస్‌ఏ-1 మోడల్ ప్రశ్నాపత్రాలు పరిశీలించుకుంటే మంచిది. తక్కువ సమయం ఉన్నందున అన్ని పాఠాల మీద సింపుల్ టచప్ చేసి వదిలేయాలి.

- సీవీ ప్రసాద్, స్కూలు అసిస్టెంటు

గత ప్రశ్న పత్రాలు జాగ్రత్తగా పరిశీలించాలి



విద్యార్థులు సాంఘిక శాస్త్రంలో నూటికి నూరు మార్కులు సాధించడం కోసం గత ప్రశ్నాపత్రాలు జాగ్రత్తగా పరిశీలించి ప్రశ్నల సరళి అర్థం చేసుకోవాలి. రెండు మార్కులు, నాలుగు మార్కులు, 8 మార్కుల ప్రశ్నలను సూటిగా పాయింట్ల రూపంలో చక్కని దస్తూరితో రాయాలి. మ్యాప్ పాయింట్ల పట్ల శ్రద్ధ వహించి ఇండియా, వరల్డ్ మ్యాప్‌లను బాగా ప్రాక్టీసు చేయాలి. పరీక్షకు ప్రిపేరు అయ్యేటప్పుడు ప్రశ్నలకు సమాధానాల్లో ముఖ్యమైన అంశాలు నోట్ చేసుకోడం వల్ల అన్ని ప్రశ్నలు సులభంగా నేర్చుకోవచ్చు. అలాగే గుర్తుపెట్టుకోవచ్చు.

- సి.మహబూబ్‌షరీఫ్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, రాజుపాలెం

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

● చైర్మన్ వార్డులోనే నీరు రాకపోతే ఎలా ● పోలీసులతో వాగ్వాదం

మైదుకూరు, మార్చి 16 : అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయ లోపంతో మైదుకూరు పట్టణ ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతూ రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ వార్డు కేసీ నగర్ 2వ వీధిలో 10 రోజులుగా కుళాయిలకు నీళ్ళు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఓట్లేసి గెలిపించినా ఆయన ఇటువైపు కన్నెత్తి చూడలేదంటూ శనివారం ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. కడప రోడ్డు ప్రధాన రహదారి కావడంతో కాసేపు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ పాండురంగారెడ్డి సిబ్బందితో కలసి అక్కడికి చేరుకొని రోడ్డుపై ట్రాఫిక్ ఆపి ఆందోళన చేయవద్దన్నారు. ఏమైనా ఉంటే మున్సిపల్ ఆఫీసు వద్దకు వెళ్లి అధికారులకు తెలపాలన్నారు. కానీ మేము వెళ్ళం అధికారులు గానీ, లేక మేము ఓట్లేసిన మున్సిపల్ చైర్మన్ గాని రావాలంటూ పట్టుపడుతూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న స్థానిక వైసీపీ నాయకుడు ఒకరు నీళ్ళ ట్యాంకర్‌ను ఆ వీధిలోకి తెప్పించడంతో గొడవ ఆగిపోయింది.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

రోడ్డెక్కితే గాని నీళ్ళు పంపరా అయినా ట్యాంకర్ కాదు కుళాయిలకు నీళ్ళు వచ్చేలా చేయ్యాలి అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మైదుకూరులోని 9,10,15,16,17,20, వార్డులలో అప్పుడే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి.

● 500 లీటర్లు రూ.400తో కొనుగోలు..: 9 ఏళ్ళ తరువాత మళ్లీ నీళ్ళు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారులోని ఎర్రచెరువులో తెలుగుగంగ నుంచి నీటిని విడుదల చేసేలా దాదాపు 10 ఏళ్ళ క్రితం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ శాశ్వత జీవో తీసుకొచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు నీటి సమస్య లేదు. అయితే అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో ఎర్రచెరువుకు నీళ్లు నింపలేదు. దీంతో భూగర్భజలాలు నిండుకొని మైదుకూరు పట్టణంలో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. పట్టణంలో మళ్లీ ఇన్నేళ్లకు 500 లీటర్లు రూ.400కు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని పట్టణ వాసులు ఆవేదన చేందుతున్నారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మహిళలు

అగ్నికి ఆహుతైన అరటి పంట



అరటి తోట వద్ద బాధిత రైతు శ్రీనునాయక్

వేంపల్లె, మార్చి 16: మండలంలోని బక్కన్నగారిపల్లెలో అరటి పంట దగ్ధమైన సంఘటన శనివారం జరిగింది. బాధిత రైతు బుక్కే శ్రీనునాయక్ తెలిపిన వివరాలు మేరకు... ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దాదాపు రెండు ఎకరాల్లోని అరటి పంట దగ్ధమైందన్నారు. నిప్పంటుకున్న విషయాన్ని ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారన్నారు. ఈ ప్రమాదం కారణంగా రూ.7లక్షలు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వీరబల్లి, మార్చి 16: గుడికి రంగులు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీ బెజవాడ హరిజనవాడకు చెందిన గండుపల్లి సుధాకర్ (45) శనివారం ఉదయం గంగమ్మ గుడికి రంగులు వేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని 108 వాహనంలో రాయచోటి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మార్గమధ్యంలోనే మరణించినట్లు నిర్ధారించారు. సుధాకర్‌రెడ్డికి భార్య, కూతురు ఉన్నట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి వ్యాపారులకు వైసీపీ తాయిలాలు

● వైసీపీ రంగుల గొడుగులు వితరణ

ప్రొద్దుటూరు , మార్చి 16 :వైసీపీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంలో రకరకాల ఎత్తులు వేస్తున్నారు. ఏవిధంగానైనా తాయిలాలు అందించి ఓట్లు రాబట్టుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఎంపీ అవినాష్ రెడ్డి ముఖ్యమంత్రి జగన్ బొమ్మలతో ముద్రించిన గొడుగులను వీధి వ్యాపారులకు గత రెండు రోజులు అందజేస్తున్నారు. ముఖ్యంగా వేసవి ఎండల సందర్భంగా వారికి నీడనిచ్చే పేరిట ఈ తాయిలాలు అందజేస్తున్నారు. చాలా చోట్ల రోడ్లమీద తోపుడు బండ్లలో పండ్లు అమ్ముకునే వారికి టెంకాయల విక్రయాల వద్ద సైకిల్ షాపుల వద్ద చెప్పులు కుట్టే వారివద్ద ఇలా అనేక చోట్ల ఈ గొడుగులు పంచిపెట్టారు. అయితే శనివారం ఎన్నికల కోడ్ రావడంతో ఎన్నికల అధికారులు వీటిని తొలగిస్తారా లేదా వేచి చూడాలి .



వీధి వ్యాపారులకు వైసీపీ నాయకులు పంపిణీ చేసిన గొడుగులు

ప్రకృతి కోపం.. ప్రభుత్వానికి లేదు కనికరం

● గత ఏడాది డిసెంబరులో తుఫానుతో నష్టపోయిన పంట రైతులు ● బటన్ నొక్కినా అందని పరిహారం

చిట్వేలి, మార్చి 16: పెరిగిన పెట్టుబడి వ్యయం, గిట్టుబాటు కాని ధరలు, అనుకూలించని వాతావరణంతో అన్నదాత నలిగిపోతున్నాడు. జూదంలా మారిన వ్యవసాయంలో రైతు నష్టపోతూనే ఉన్నాడు. ఏటా నష్టాలను చవిచూస్తున్నా పుడమి తల్లిని నమ్ముకుని కష్టాన్ని పెట్టుబడిగా చేసుకుని వ్యవసాయం సాగిస్తున్నప్పటికీ రైతుల నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. సంక్షోభంలో కూరుకుపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలన్న ధ్యాసే పాలకులకు లేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది డిసెంబరు మిచౌంగ్ తుఫాను తాకిడికి మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుఫాను ప్రభావంతో మండలంలో 11 మంది రైతులకు చెందిన 3.5 హెక్టార్లలో నిమ్మ పంటకు నష్టం వాటిల్లగా, 679 మంది రైతులకు చెందిన 294.75 హెక్టార్లలో అరటి పంట, 29 మంది రైతులకు చెందిన 14.1 14.1 హెక్టార్లలో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు.

మూడు నెలలు దాటినా అందని పరిహారం

గత ఏడాది డిసెంబరు 5, 6 తేదీల్లో తుఫాను తాకిడికి రైతులకు అపార పంట నష్టం వాటిల్లింది. నష్టపోయిన పంటలను సంబంధిత అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపించినప్పటికీ ఇంతవరకు మండలంలో రైతుల ఖాతాలో పైసా కూడా జమ కాకపోవడం రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. తుఫాను వల్ల దెబ్బతిన్న రైతుల నష్టపరిహారానికి చెందిన డబ్బులను ఈనెల 6వ తేదీ సీఎం జగన్ బటన్ నొక్కినా ఇంతరకు రైతులకు అది అందలేదు. ఇది ఉత్తుత్తి నొక్కుడే అని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు వేసిన పంట నష్టం వివరాలిలా ఉన్నాయి. నిమ్మ 3.5 హెక్టార్లకు గానూ రూ.78,750, అరటి 294.75 హెక్టార్లకు గాను రూ.73,68,750, బొప్పాయి 14.1 హెక్టర్లకు గానూ రూ.2,39,700 అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. కానీ ఇప్పటి వరకు ఏ ఒక రైతుకు పంట నష్టం సహాయం అందించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు పంట నష్టం పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నాగవరంలో పడిపోయిన పంటను పరిశీలిస్తున్నఉద్యాన శాఖాధికారులు (ఫైల్)



పంట నష్టపరిహారం త్వరగా ఇవ్వాలి



ఐదు ఎకరాలలో అరటి పంట సాగు చేశాను. రెండు లక్షల పైచిలుకు వరకు ఖర్చులు వచ్చాయి. అకాల వర్షాల వల్ల చాలా వరకు పంటలు నష్టపోయాం. అధికారులు వచ్చి పంట నష్టం వివరాలను నమోదు చేసి రైతులపై చిత్తశుద్ధి ఉంటే నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి.

- నాసింశెట్టి ఈశ్వరయ్య, కొత్తపల్లి గ్రామం

ఒక్క అవకాశం ఇవ్వండి...

నియోజకవర్గం అభివృద్ధి చేసి చూపిస్తా

●మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్



టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్న మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ కటారు వీరన్న తదితరులు

మైదుకూరు రూరల్ మార్చి 16 : తనపై నమ్మకం ఉంచి , ఒక్కసారి అవకాశం ఇవ్వండి నియోజకవర్గం అభివృద్ధి చేసి చూపిస్తానని మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మండలంలోని పప్పనపల్లె పంచాయతీ సర్పంచ్ మూలే వెంకట లక్షుమ్మ,వనిపెంట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కటారు వీరన్నలు వైసీపీని వీడి టీడీపీ కండువాలను పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో కప్పుకొన్నారు. పప్పనపల్లె,వనిపెంటలలోపుట్టాకు నాయకులు,గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. దారి వెంబడి డప్పుల చప్పుడు ,బాణా సంచాలు కాలుస్తు పూలు చల్లుతు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలలో పుట్టా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే కాకున్నా నియోజకవర్గ అభివృద్ధి కోసం తొమ్మిది వందల కోట్ల నిధులు తీసుకొచ్చానని తెలిపారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంలా తీర్చిదిద్దుతానని తెలిపారు. పప్పనపల్లె నుంచి పార్టీలో చేరిన వారిలో మూలే రాజగోపాల్ రెడ్డి,పడిగపాటి నారాయణరెడ్డి,మూలే వెంకటరమణారెడ్డి, మూలే వెంకటరామిరెడ్డి,మూలే వెంకటరాజా,పిల్లిరాజా,బోనాల వీరాంజి నేయులు లతో పాటు మరో 50 కుటుంబాలు చేరాయి. వనిపెంట నుంచి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ కటారు వీరన్న,కటారు నాగ,రామసుబ్బయ్య,కటారు అబ్బి,కటారు చంద్ర,సుబ్బరాయుడు,శేషు, గోపాల్, రాజశేఖర్ లతో పాటు మరో వంద కుటుంబాలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య, చాపాడు మాజీ మండలాధ్యక్షుడు ద్వార్శల గురివిరెడ్డి,చీకిరి వెంకటసుబ్బయ్య, జయ భరత్‌రెడ్డి,బీఎస్ శ్రీనివాసులు,ఏపీ రవీంద్ర,ధనపాల జగన్, చెర్లోపల్లి రమణ,నాగమోహన్,ఇస్మాయిల్, పాలమాబు తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లెలో..: మండలంలోని పోతిరెడ్డిపల్లె గ్రామంలోని వైసీపీ నాయకులు చాగంరెడ్డి రామచంద్రారెడ్డి,చాగంరెడ్డి రామిరెడ్డి, రాఘవరెడ్డి,ప్రభాకర్‌రెడ్డి,మూలె పెద్దపుల్లారెడ్డి, మూల మైసూరారెడ్డి,వీరారెడ్డి,సుబ్బారెడ్డి,చంద్రారెడ్డి,సుబ్బమ్మ,చాగంటి నాగిరెడ్డిలతో పాటు మరో 50 కుటుంబాలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

కోడ్ కూసింది..!

రాజకీయ పార్టీల కటౌట్‌లు,ఫ్లెక్సీలు, బోర్డుల తొలగింపు

నేతల విగ్రహాలకు ముసుగులు





మైదుకూరు, ప్రొద్దుటూరులో ఫ్లెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు , మార్చి 16 : సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలతో దేశవ్యాపితంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఎన్నికల అధికారులు కోడ్ అమలులో భాగంగా పట్టణంలో గ్రామాల్లో ఎక్కడకూడా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, కటౌట్‌ల తొలగింపు పనులు చేపట్టారు. అలాగు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి జగన్ , మంత్రులు ఎమ్మెల్యేల ఫొటోలను తొలగించే పనులు చేపట్టారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయాల్లో సచివాలయాల్లో ఎక్కడా కూడా ప్రభుత్వ పథకాల పోస్టర్లు ఇతరత్ర కరపత్రాలు ఏమీ వుండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పట్టణ కూడళ్లలో వున్న రాజకీయ పార్టీల విగ్రహాలకు తెలుపు రంగు ముసుగులు తొడిగారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగితే సంబంధిత అధికారి సిబ్బందిపై చర్యలు తీవ్రంగా వుంటాయని ఎన్నికల అధికారి కలెక్టర్ విజయరామరాజు వీడియో కాన్ఫరెన్సులో అధికారులను ఆదేశించారు.

మైదుకూరు..: పార్లమెంట్, శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఆ దిశగా మైదుకూరులో శనివారం మధ్యాహ్నం నుంచి తగిన చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు నియోజకవర్గ ఎన్నికల అధికారి చంద్రమోహన్ మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలల్లోని పబ్లిక్ స్థలాల్లో రాజకీయ పార్టీల ప్రచార పోస్టర్లు ఉండకూడదని తెలిపారు. ఈ మేరకు సిబ్బందితో తీయించారు. అలాగే మైదుకూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు మొత్తం 2,10,264 మంది ఓటర్లున్నారన్నారు. మైదుకూరులో 63,755 మంది, దువ్వూరులో 40,543 మంది,చాపాడులో 32,226, ఖాజీపేటలో 42,365, బ్రహ్మంగారి మఠం మండలంలో 31,375 మంది ఓటర్లున్నారని తెలిపారు. ఇందులో 18 నుంచి 19 వయస్సునవారు 39,875 మంది ఓటర్లున్నారని, 85 సంవత్సరాల పైనున్న వారు 826 మంది, సర్వీస్ ఓటర్లు 284, ఎన్‌ఆర్‌ఐలు 32మంది ఉన్నారని ఆయన తెలిపారు. కాగా మొత్తం 269 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు.

రాజీ మార్గం రాజమార్గం

జమ్మలమడుగు, మార్చి 16: కక్షిదారులు వారి కేసులను రాజీ మార్గంలో పరిష్కారం చేసుకోవడం వలన రాజమార్గంతోపాటు కక్షిదారులు ఇద్దరూ గెలిచినట్లేనని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం జమ్మలమడుగు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, మండలాలకు చెందిన వివిధ కేసుల కక్షిదారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బార్‌అసోసియేషన్ సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, జంబాపురం మహేశ్వరి, భూతమాపురం సుబ్బారావు, పెద్దిరాజు, సయ్యద్, జాకీర్, సుబ్బారెడ్డి, మునిసుబ్బారెడ్డి, నాగార్జునరెడ్డి, లోక్ అదాలత్ సభ్యురాలు సంధ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'సైకో నియంత పాలన ఇక సాగదు'

ఖాజీపేట, మార్చి 16: రాష్ట్రంలో ఇక సైకో నియంత పాలన సాగదని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుధాకర్‌యాదవ్ అన్నారు. శనివారం పత్తూరు పిచ్చినాయుడు గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సైకోపాలనకు ఇక సమయం లేదని, ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని, ప్రజలను భయపెట్టే నాయకుడు మనకొద్దని, సేవ చేసే నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, బుచ్చిరెడ్డి, రామానాయుడు, బండి వెంకటేష్, పుల్లయ్యనాయుడు, పల్లె గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పది పరీక్షలు

● ప్రొద్దుటూరు డివిజన్‌లో 70 సెంటర్లు 14,113 మంది విద్యార్థులు

ప్రొద్దుటూరు, టౌన్, మార్చి 16: పదో తరగతి విద్యార్థులకు కీలకమైన పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకోసం ప్రొద్దుటూరు డివిజన్‌లోని 18 మండలాల్లో 70 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 14,113 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రొద్దుటూరు మండల పరిధిలో 4,149 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా వారికి 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. ప్రతిరోజు ఉదయం 9.30 నుండి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షల సమయంలో పరీక్ష కేంద్రం చీఫ్ ఆఫీసర్, డిపార్టుమెంటల్ ఆఫీసర్, ఇన్విజిలేటర్‌తోపాటు ఏఎన్ఎంలకు పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను విద్యాధికారులు చేపట్టారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి





ప్రొద్దుటూరు, మైదుకూరులో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్య సభ నాయకులు ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఉదయం లైట్‌పాళెం సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు , ఆర్యవైశ్య సభ కోశాధికారి మిట్టా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి సంద ర్భంగా శనివారం మైదుకూరు ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాల సభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్ ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేపట్టి, ప్రధాన రహదారుల మీదుగా పొట్టిశ్రీరాముల సర్కిల్‌లోని ఆయన విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఆయన విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి ఆయన చేసిన సేవలు కొనియాడారు.సభ్యులు డీబీ సునీల్, డీవీ సుబ్బయ్య, యలిశెట్టి ప్రసా ద్, పబ్బతి గోపాల్, సూరే సుబ్బరాజ, మారుతి,శ్రీరాములు,రాజశేఖర్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో ఆర్యవైశ్యసభ అనుబంధ సంస్థల వారు శనివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం వద్ద నుంచి పాత బస్టాండులోని ప్రొద్దుటూరు రోడ్డు అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహం వరకు ఆర్యవైశ్యులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు మల్లెంకొండు సుబ్రహ్మణ్యం, యువజన సేవా సంఘం అధ్యక్షుడు సుమన్‌కుమార్, మహిళా మండలి అధ్యక్షురాలు అరుణకుమారి, సంఘ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బద్వేలు..: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు బద్వేలులో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సిద్దవటం రోడ్డులోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి ఆ.వో.పా సెక్రటరీ సి.వి. నాగేశ్వరరావు, సుబ్బారావు, వెంకరమణ, మహిళా విభాగ అధ్యక్షురాలు మాధవీలత పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు.

అబద్ధాల ముఖ్యమంత్రి ఆపద్ధర్మ ముఖ్యమంత్రి అయ్యాడు

మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, జనసేన జిలాన్



మాట్లాడుతున్న నాయకులు

ప్రొద్దుటూరు , మార్చి 16 : ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అబద్ధాల ముఖ్యమంత్రి కాస్త నేడు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి అయ్యాడని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య జనసేన ప్రతినిధి జిలాన్ పేర్కొన్నారు. శనివారం నెహ్రూరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ చెప్పిన వాగ్దానాలు నెరవేర్చకుండా అందరినీ వంచించాడన్నారు. ఇంట్లో ఎంతమంది అర్హులుంటే అందరికీ 3 వేల పెన్షన్ అని చెప్పి మోసం చేశాడన్నారు. అమ్మఒడి ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ అని చెప్పి వంచించాడన్నారు. 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని ఏపీకి తీరని ద్రోహం చేశాడన్నారు. విభజన చట్టంలోని కడప ఉక్కు ఫ్యాక్టరీ పేరుతో నిరుద్యోగులను దారుణంగా మోసం చేశాడన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వలే దన్నారు.ఈ పాలన అంతం కోసం ప్రతి కార్యకర్తల సైనికుడిలా పోరాడతారన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు. చీమల రాజశేఖర్‌రెడ్డి, మార్తల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జనసేన ప్రతినిధి సుంకర మురళి పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

రాజుపాలెం, మార్చి 16 : మండల పరిధిలోని చిన్న శెట్టిపల్లె గ్రామంలో రామలింగేశ్వర దేవస్థానంలో నూతనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవగ్రహ నాగ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ విగ్రహ ప్రతిష్ఠకు దాదాపు 25 లక్షల రూపాయలను ఆలయ దాతలు మెట్టుపల్లి మాధవరెడ్డి, మెట్టుపల్లి ప్రభాకరరెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అర్కటవేములలో సీతారామ విగ్రహ ప్రతిష్ఠ..: అర్కటవేముల గ్రామం ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. అనంతరం జూనియర్ ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు.

901 కేసులు పరిష్కారం

జమ్మలమడుగు, మార్చి 16: జమ్మలమడుగులో శనివారం మధ్యాహ్నం జడ్జి భార్గవి నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ మొత్తం 901 కేసులు పరిష్కారం అయినట్లు శనివారం రాత్రి 7 గంటలకు లోక్ అదాలత్ సభ్యురాలు సంధ్య తెలిపారు. 901 కేసులకు సంబంధించి రూ.72,28,724 వచ్చినట్లు ఆమె తెలిపారు.

టూటౌన్ సీఐగా అబ్దుల్ కరీం



ప్రొద్దుటూరు, మార్చి 16 : ప్రొద్దుటూరు టూటౌన్ సీఐగా అబ్దుల్ కరీం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వున్న సీఐ ఇబ్రహీం ఇటీవల కడప టూటౌన్ కు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో కర్నూలులో సీఐడీ విభాగంలో ఎస్ఐ గా ఉండి పదోన్నతిపై అబ్దుల్ కరీం ప్రొద్దుటూరు టూటౌన్‌కు సీఐగా బదిలీపై వచ్చారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఖాజీపేట, మార్చి 16: మండల పరిధిలోని పత్తూరులో నూతనంగా రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో టీడీపీ మైదుకూరు అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు. శనివారం అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠలో పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, నాగశివారెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, హరినాథరెడ్డి, వెంకటేష్, చిన్న, ఉపసర్పంచ్ రమణ, పిచ్చినాయుడు, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, క్రిష్ణారెడ్డి, ధనిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు టోపీలు, వాటర్‌బాటిళ్ల వితరణ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 16: ఎండలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని నిరాశ్రయులు, యాచకులకు టోపీలు, వాటర్ బాటిళ్లు వితరణ చేశారు. శనివారం శ్రీపాద శ్రీవల్లభ అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో 120 మందికి టోపీలు, వాటర్‌బాటిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కొండల భరద్వాజరెడ్డి, నాగరాజు , విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

బద్వేలు టౌన్, మార్చి 16 : రాబోవు పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల పాఠశాలలో 80 మంది విద్యార్థినులకు డెమోక్రటిక్ పీఆర్టీయూ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మానుగుంట రవిశంకర్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

మైదుకూరు..: కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రిని శనివారం మైదుకూరులోని స్థానిక గాయత్రి సేవా సంస్థ నిర్వాహకులు నిగిని వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. 70 మంది విద్యార్థులకు అట్ట, జామెంటరీ బాక్స్ పెన్ను, పెన్సిళ్లు తదితర వస్తువులను అందచేశారు. ప్రిన్స్‌పాల్ శోభారాణి, సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగులకు అన్యాయం జరిగితే సహించం



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు, మార్చి 16: ప్రతి వికలాంగుడికి మూడు సెంట్లు స్థలం కేటాయించేలా అధికారులు చర్యలు చేపట్టేవరకు తమ ఉద్యమాన్ని విరమించేది లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. శనివారం వికలాంగులు గుడిసెలు వేసుకున్న చోటే ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ దయాదాక్షిణ్యం లేకుండా గుడిసెలను తొలగించి అక్కడి నుంచి వెళ్లిపోవాలని పేర్కొనడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు రమణ, వెంకటరమణ, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు

ప్రయాణికులకు బహుమతులు

జమ్మలమడుగు, మార్చి 16: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో శనివారం జమ్మలమడుగు-తాడిపత్రి రూటులో అమలు చేయబడిన లక్కీడిప్ బహుమతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్కీ డిప్‌లో గెలుపొందిన ప్రయాణికులడు మొదటి బహుమతి వెంకటేష్, రెండో బహుమతి ధర్మవేణి, మూడో బహుమతి లక్ష్మీదేవి జమ్మలమడుగుకు చెందినవారికి బహుమతులు అందజేశారు. జమ్మలమడుగు-తాడిపత్రి రూటులో ప్రయాణం చేసిన వారు టిక్కెట్ వెనుక పేరు, ఫోన్ నంబరు రాసి గిఫ్టబాక్స్‌లో వేయాలని మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి

కమలాపురం రూరల్, మార్చి 16 : ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని జేసీ గణేశ్‌కుమార్ తెలిపారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా ఎన్నికల తేదీలను ప్రకటించిందన్నారు. ఈ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. నియోజకవర్గంలో 130 పోలింగ్ కేంద్రాలున్నాయ ని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 58గా నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే రాజకీయ నాయకుల బ్యానర్లు, నా యకుల విగ్రహాలు ఉండే కప్పివేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రాలు,బ్యానర్లు ఉంటే 24 గంటల్లో తలొగించాలన్నారు. ఇళ్లపై పార్టీల జెండాలు ఏర్పాటు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుబ్రమణ్యం,ఎన్నికల డీటీ నరేంద్ర పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేసేదెన్నడో..?



అధ్వానంగా ఉన్న జమ్మలమడుగు-మైలవరం రహదారి

మైలవరం, మార్చి 16: మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారుల్లో గుంతలు పడి, రాళ్లు తేలి ఆ రహదారిలో ప్రయాణించాలంటే తిప్పలు తప్పడం లేదని వాహనదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు నుంచి పట్టణాలకు వెళ్లేందుకు కొత్త రోడ్డు లేకపోగా పాత రోడ్లకు ఉంతలు పడిన చోట్ల మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను విన్నవించుకుంటున్నారు. జమ్మలమడుగు నుంచి మైలవరం వెళ్ల రహదారి, మాదవాపురం నుంచి బెస్తవేముల, కల్లుట్ల నుంచి కల్వటాల, వద్దిరాల నుంచి నక్కవానిపల్లి తదితర గ్రామాలకు వెళ్ల రోడ్లు గుంతలు పడి అధ్వాన్నంగా దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఆ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే నరకంలా ఉందని పలు గ్రామాల ప్రజల వాపోతున్నారు.



గుంతలు పడి రాళ్లు తేలిన మాధవాపురం - బెస్తవేముల రహదారి

అక్రమ మద్యంసీసాలు స్వాధీనం

ముద్దనూరు మార్చి16:మండల పరిధి దేనేపల్లి గ్రామం వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. నల్లబోయిన రామసుబ్బయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నున్న 30మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కొండాపురం..: మండలంలోని అనంతపురం క్రాస్ వద్ద 18 మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.రాజా అనే వ్యక్తి 18 మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

బి.కోడూరు, మార్చి 16 : మండల పరిధిలోని పాయలకుంట్ల, రామచంద్రపురం పాఠశాల విద్యార్థులకు దంత వైద్యాధికారి సబిత దంతపరీక్షలు నిర్వహించారు. 18 మందికి దంతాల సమస్య ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి



సిరిగేపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న భూపేశ్‌రెడ్డి తల్లి సరస్వతి, సతీమణి జ్యోతి

జమ్మలమడుగు, మార్చి 16: చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి సరస్వతి తెలిపారు. శనివారం సాయంత్రం జమ్మలమడుగు మండలంలోని సిరిగేపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, టీడీపీ నాయకులు మధు, రామకోటి, గురుప్రసాద్, మల్లికార్జున, కృష్ణయ్య, సుబ్బరాయుడు, కిట్టయ్య, చిన్న, సుబ్బరాయుడు, మల్లి, రామసుబ్బయ్య, శంకర్, మహిళలు పాల్గొన్నారు.

గ్రూప్ 1లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి

బద్వేలు, మార్చి 16: 2018 గ్రూప్-1 మెయిన్స్ పోస్టులకు సంబంధించి జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పేర్కొన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనం నందు ఆ సంఘం బద్వేలు రూరల్ కార్యదర్శి బాల గురవయ్య, నాయకులు సురేష్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు ఎన్నికల కోడ్ బేడీలు : భూపేశ్



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 16: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ఎన్నికల కోడ్ రావడంతో వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ వైసీపీ నాయకులకు బేడీలు వేసినట్లేనని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మధ్యాహ్నం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన టీడీపీ,జనసేన నాయకులు భూపేశ్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడం వలన ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. దీంతో వైసీపీ అరాచక పాలనకు స్వస్తి అన్నారు. ఇక నుంచి అధికారులు పార్టీలకతీతంగా పనిచేయాలని ఆయన కోరారు. ప్రస్తుతం వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ దుందుభి మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహునికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, మార్చి 16 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ఫాల్గుణ మాసం శనివారాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. దాతలు ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కామిశెట్టి సుకుమార్, ఆయన సతీమణి సింధు సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.